క్లుప్తంగా

ఇంటి వద్దనే వైద్య సేవలు



చికిత్స అందిస్తున్న డాక్టర్ జ్యోతిర్మయి

తాడిమర్రి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఏకపాదంపల్లి గ్రామంలో డాక్టర్ జ్యోతిర్మయి మంగళవారం వైద్య సేవలు అందించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక రోగులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే జబ్బులతో మంచం పట్టిన రోగుల ఇళ్లను సందర్శించి ఆరోగ్యం కుదుట పడటానికి తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

నేటి నుంచి పంట రుణాల రెన్యూవల్

కనగానపల్లి: మామిళ్లపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ)లో బుధవారం నుంచి ఖరీఫ్ పంట రుణాలు రెన్యూవల్ చేస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ జార్జ్ ప్రదీప్ తెలిపారు. ఈనెల 19, 20న చాపట్ల, గోళ్లపల్లి, 21 నుంచి 25 వరకు మరూరు, 26, 27న చెర్లోపల్లి, 28, 29న పర్వతదేవరపల్లి, మే 3 నుంచి 6 వరకు ముక్తాపురం, 8 నుంచి 10 వరకు మామిళ్లపల్లి, 11 నుంచి 16 వరకు కుర్లపల్లి, 17 నుంచి 20 వరకు చంద్రాశ్చర్ల, 29 నుంచి 31 వరకు దాదులూరు గ్రామాల రైతులు రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

మత్తుకు దూరంగా ఉండండి



పోస్టర్లు అతికిస్తున్న సీఐ, ఎస్ఐ

ముదిగుబ్బ: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సీఐ కంబగిరి సూచించారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో మంగళవారం ఆయన ఆటో డ్రైవర్లకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఆటోలకు పోస్టర్లు అంటించారు. యువతా మేలుకో..భవితను మలుచుకో.. డ్రగ్స్‌ను వదులుకో అంటూ నినాదాలు చేయించారు. ఎస్ఐ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

కలప డిపోలో అగ్నిప్రమాదం

ధర్మవరం అర్బన్: కలప డిపోలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని కలప దగ్ధమైంది. పట్టణానికి చెందిన అబ్దుల్ ఘనీ అనే వ్యక్తి దుర్గమ్మ దేవాలయం వెనుక కలప డిపో నిర్వహిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో కిటికీలు, తలుపుల తయారీకి సిద్ధంగా ఉంచిన కలప, విద్యుత్ మీటర్, ఫ్యాన్ కాలిపోయాయి. రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

దేవరెద్దు మృతి



మృతి చెందిన దేవరెద్దు


గాండ్లపెంట: వేపరాల పంచాయతీ తిరుమల దేవుని ఆలయ దేవరెద్దు సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం ఆలయ సమీపంలోని మాలి వద్ద దేవరెద్దుకు హిందూ సంప్రదాయ ప్రకారం దహన సంస్కారాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా సంక్రాంతి పర్వదినాన దేవరెద్దును అలంకరించి ఉత్సవాలు నిర్వహించేవారు.

కంటి అద్దాల పంపిణీ

బత్తలపల్లి: సంజీవపురం కేజీబీవీ పాఠశాలలో దృష్టి లోపంతో బాధపడుతున్న 16 మంది విద్యార్థులకు కంటి వెలుగు కార్యక్రమం కింద మంగళవారం సర్పంచు వరలక్ష్మి చేతుల మీదుగా వైద్యాధికారులు కంటి అద్దాలు అందజేశారు. కేజీబీవీ ఎస్ఓ నాగరత్నభాయ్ పాల్గొన్నారు.

కదిరి అర్బన్: మొటుకుపల్లి ఆర్టీటీ కేంద్రంలో మంగళవారం ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. రఫిక్, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

వృత్తిని దైవంగా భావించాలి



డాక్టర్ నాగజ్యోతి దంపతులను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

ధర్మవరం అర్బన్: ప్రతి ఉద్యోగి వృత్తిని దైవంగా భావించి ప్రజలకు సేవలు అందించాలని పదోన్నతిపై నంద్యాలకు బదిలీపై వెళ్తున్న ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ నాగజ్యోతి అన్నారు. వైద్యులు, సిబ్బంది మంగళవారం పట్టణంలోని ఎన్జీవో హోంలో వైద్యాధికారిణి డాక్టర్ నాగజ్యోతి, భాస్కర్ దంపతులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వి సాల్మన్, వైద్యులు ఉరుకుందప్ప, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతకు ధాన్యలక్ష్మి కటాక్షం

- బుక్కపట్నం చెరువు ఆయకట్టు కింద మొదలైన వరి కోతలు
- ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడులు
- ఖర్చులు పోనూ ఎకరాకు రూ.70వేల ఆదాయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



కుప్పగా పోసిన వరిధాన్యం

పుట్టపర్తి: అలుపెరగకుండా శ్రమించే అన్నదాతను ధాన్యలక్ష్మి కటాక్షించగా ధనలక్ష్మి కాసుల వర్షం కురిపిస్తోంది. రాష్ట్రంలో రెండో అతి పెద్దదైన బుక్కపట్నం చెరువు కింద సాగు చేసిన వరి కోతలు మొదలై పంట నూర్పిడిలు జోరందుకున్నాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, ప్రభుత్వం మద్దతు ధర కల్పించడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

నాలుగేళ్లుగా విస్తారంగా పంటల సాగు

బుక్కపట్నం చెరువు గతంలో ఏడేళ్లకో, ఎనిమిదేళ్లకో నిండేది. వైఎస్సార్ చొరవతో 2006-09 సంవత్సరంలో హంద్రీ-నీవా కాలువ పనులు 80 శాతం పూర్తి చేశారు. ఈక్రమంలో 2019నుంచి బుక్కపట్నం చెరువుకు కృష్ణా జలాలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటినుంచి చెరువు ఆయకట్టు కింద విస్తారంగా పంటలు సాగు చేస్తున్నారు. దీంతో అన్నదాతల జీవితాల్లో వెలుగులు సంతరించుకుంటున్నాయి. ఈ ఏడాది 2వేల ఎకరాల్లో వరి సాగైంది. వాతావరణం అనుకూలించడం, సాగు జలాలు పుష్కలంగా ఉండటంతో దిగబడులు ఆశాజనకంగా ఉంటున్నాయి. కోతలు ప్రారంభం కావడంతో రైతులు పంటను నూర్పిడి చేసి ధాన్యాన్ని ఆరబోసి మార్కెట్లకు తరలిస్తున్నారు. ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్లు రైతులు తెలిపారు. క్వింటా రూ.2500తో విక్రయిస్తున్నామని, పెట్టుబడులు పోనూ ఎకరాకు రూ.60 నుంచి 70 వేల ఆదాయం లభిస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండు ఎకరాలకు రూ.1.20 లక్షల ఆదాయం



చెరువు కింద రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాను. ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి లభించింది. సాగు ఖర్చులు పోను రూ.లక్షా 20 వేల ఆదాయం వచ్చింది.
– పూలకుంట్ల నాగరాజు, బుక్కపట్నం

కౌలు రైతుకు మేలు



ఓ రైతు నుంచి ఒక ఎకరం కౌలుకి తీసుకొని వరి సాగు చేశాను. కౌలు, పంట ఖర్చులు పోనూ ఎకరాకు సుమారు రూ.40 వేల ఆదాయం వచ్చింది. కూలీ పనులకు పోయే బదులు కౌలుకు భూమి తీసుకొని సాగు చేసుకోవటం లాభదాయకం.
– తిప్పన్న, కౌలు రైతు, బుక్కపట్నం

ఎస్పీని కలిసిన రెడ్డి సంఘం నాయకులు



ఎస్పీ మాధవరెడ్డికి సాయిబాబా చిత్రపటాన్ని అందించి సత్కరిస్తున్న దృశ్యం

కొత్తచెరువు: జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డిని రెడ్డి సంఘం నాయకులు మంగళవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు రుషీకేశవరెడ్డి, నాయకులు నాగిరెడ్డి, రాజారెడ్డి, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

నేడు పైపల్లిలో గడప గడపకూ...

పుట్టపర్తి అర్బన్: మండలంలోని పైపల్లిలో బుధవారం ఉదయం 7.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

ఆక్రమణలు తొలగించి రోడ్లు ఏర్పాటు చేయండి



రోడ్ మ్యాప్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

ప్రశాంతి నిలయం: ఎనుములపల్లి శిల్పారామం హౌసింగ్ కాలనీలో ఆక్రమణలు తొలగించి రోడ్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్, రెవెన్యూ సిబ్బందిని ఎమ్మెల్యే దద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదేశించారు. వివరాలు. కాలనీలో రోడ్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే గతంలో రూ.35లక్షలు విడుదల చేయించగా పనులు జరుగుతున్నాయి. అయితే కొందరు రోడ్లకు అడ్డుగా నిర్మాణాలు చేపట్టడంతో సమస్య ఏర్పడింది. దీంతో మంగళవారం సాయంత్రం ఆయన కాలనీలో పర్యటించారు. రోడ్లను కొలత వేయించారు. అక్కడక్కడ ఆక్రమణలు ఉండటంతో వాటిని తొలగించి 20 అడుగులతో రోడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. చైర్మన్ తుంగా ఓబులపతి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, కమిషనర్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్నను మరోమారు ఆశీర్వదించండి



బత్తలపల్లి: అభిప్రాయాలు సేకరిస్తున్న ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు



అమడగూరు: పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బత్తలపల్లి: 'జగనన్నే మా భవిష్యత్', 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి బత్తలపల్లి మండలంలో ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు అన్నారు. బత్తలపల్లిలోని స్టేట్ బ్యాంకు వెనుకున్న కాలనీ, టీచర్స్ కాలనీలో మంగళవారం ఆయన ఇంటింటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అభిప్రాయాలను తెలుసుకుని, గోడలపై స్టిక్కర్ అంటించారు. మరోమారు జగనన్నను ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, సాకే గోపాల్, వడ్డె ప్రసాద్, పరశురాంబాబుతో పాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అమడగూరు: అన్ని పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ జయప్ప పాల్గొన్నారు.

నల్లచెరువు: తవళంమర్రి పంచాయతీ కడపలవాండ్లపల్లిలో సహకార సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మైనార్టీ కుటుంబాలకు వంటసరుకులతో కూడిన కిట్లు అందజేశారు.

కొత్తచెరువు: విజయనగర కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిబాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, పీవీ సిద్దారెడ్డి

ప్రశాంతి నిలయం: కులం, మతం, వర్గం, పార్టీ అనే తేడా లేకుండా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగనన్న ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. వార్డు ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో అమలు చేశారన్నారు. అక్క చెల్లెమ్మలకు అండగా నిలిచారన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను ఆపకుండా కొనసాగించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సచివాలయాల కన్వీనర్ సూర్యాగౌడ్, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు సాయిలీల, సాయిగీత, చెరువు భాస్కర్ రెడ్డి, నాయకులు బెస్త రమేష్, బిల్డర్ మల్లికార్జున, హనుమంత రెడ్డి, కవిత, భారతి పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం

తనకల్లు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలను అందజేస్తున్నామని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి అన్నారు. కాటేపల్లి, తమ్మిశెట్టివారిపల్లి, బిసినివారిపల్లి, బంగారువాండ్లపల్లి గ్రామాల్లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించారు. రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి కాటేపల్లి వరకు తారురోడ్డు వేయించాలని, తమ్మిశెట్టిపల్లి, కాటేపల్లిలో సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చెడిపోయిన బోరును మరమ్మతు చేయించాలని ఈఓఆర్డీ ఆనందయ్యను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్... గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి పథకాలను ఇంటివద్దకే అందజేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు ఎల్లో మీడియాలో అర్థంపర్థం లేని రాతలు రాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు మరోమారు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ పూల నరసింహులు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు హిమధర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఈశ్వరప్ప, నాయకులు శ్రీనివాసులనాయుడు, చిన్నపరెడ్డి, ఆనంద్‌రెడ్డి, రామిరెడ్డి, గౌస్‌పీర్, నాగభూషణరెడ్డి, శ్రీనివాసులు, గణేష్‌రెడ్డి, చిదానందరెడ్డి, సిద్దారెడ్డి, రహంతుల్లా, పూలశీనా, బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


సింగిల్‌విండో పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం



ప్రమాణ స్వీకారం చేసిన అధ్యక్షురాలు సుశీలమ్మ, డైరెక్టర్లు ఆదెప్పనాయుడు, ఇమాంసాబ్

ఎన్‌పీకుంట: సింగిల్ విండో అధ్యక్షురాలిగా నూతనంగా ఎన్నికైన ముసల్‌రెడ్డి సుశీలమ్మ, డైరెక్టర్లు ఆదెప్పనాయుడు, ఇమాంసాబ్ ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో అధికారులు వారితో ప్రమాణం చేయించారు. అధ్యక్షురాలు సుశీలమ్మ మాట్లాడుతూ అన్నదాతలకు మెరుగైన సేవలు అందిస్తూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తమకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డికి, ఎంపీపీ ఈటిరాముకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైఎస్సార్ కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ ఈటిరాము, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, పారిశ్రామికవేత్త ముసల్‌రెడ్డి గారి హరీష్‌రెడ్డి, ఎంపీటీసీలు సరస్వతి, తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యులు సుబహాన్, సర్పంచ్ విష్ణుమూర్తి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ బయారెడ్డి, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, నాయకులు నారాయణస్వామి, కలాం, పుల్లారెడ్డి, శంకర్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ షాహిద్‌బాషా, గాండ్లపెంట సీఈఓ షామీర్‌బాషా, ఏడీసీసీ బ్యాంక్ సూపర్‌వైజర్, ఇన్‌చార్జ్ సీఈఓ గీతాంజలి పాల్గొన్నారు.

ఘనంగా లైలతుల్ ఖద్ర్ పర్వదిన వేడుకలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఎన్‌పీకుంట: ముస్లింల పవిత్ర రాత్రి లైలతుల్ ఖద్ర్ పర్వదినాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులను వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్థానిక జామియా మసీదులో ప్రభుత్వ ఖాజీ హజ్రత్ యూసుఫ్ లైలతుల్ ఖద్ర్ విశిష్టతను గురించి వివరించారు. ఇస్లాం మతానికి మూలాధారమైన దివ్య ఖురాన్ ఈ రాత్రుల్లోనే ఆవిర్భవించిందని తెలిపారు. మనస్ఫూర్తిగా అల్లాహ్‌ను ప్రార్థిస్తే మనం చేసిన పాపాలను ప్రక్షాళన చేసి పుణ్యఫలాలు అందజేస్తారని ఖురాన్ తెలుపుతోందని వివరించారు. అనంతరం అర్ధరాత్రి మండల కేంద్రంలోని ఈద్గా మైదానానికి వెళ్లి విశ్వశాంతి కోసం, సమస్త మానవాళి మేలు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

రామగిరి: ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి విధి విధానాలను తెలియజేశారు. అనంతరం ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేడు ముస్లింలకు ఇఫ్తార్ విందు

కదిరి టౌన్: పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయవర్గాలు తెలిపాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు హాజరు కావాలన్నారు.

పోస్టర్ల విడుదల

నల్లచెరువు: కేంద్ర విధానాలను నిరసిస్తూ నిర్వహించే ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను సీపీఐ కార్యదర్శి కదిరప్ప ఆవిష్కరించారు.

అగ్ని ప్రమాదాలను ఇలా అరికట్టొచ్చు



పుట్టపర్తిటౌన్: అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పుట్టపర్తి పట్టణ సమీపంలో ఉన్న ప్రశాంతి పెట్రోల్ బంక్, గ్యాస్ గోడౌన్లు, అపార్టుమెంట్లలో మంగళవారం అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి నాగరాజునాయక్ పాల్గొన్నారు.

ధర్మవరం: గాంధీనగర్‌లోనున్న పెట్రోల్ బంకులో మాక్ డ్రిల్ నిర్వహించి పెట్రోల్ వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో ద్వారా చూపించారు. అగ్నిమాపక అధికారి రాజు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తిమ్మంపల్లి సూర్యప్రతాప్‌రెడ్డికి నివాళి



సూర్యప్రతాప్‌రెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: దివంగత నేత, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి (సూరీడు) వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం తిమ్మంపల్లికి తరలివెళ్లారు. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డితో పాటు పలువురు తరలివెళ్లి సూర్యప్రతాప్‌రెడ్డి ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చలివేంద్రాల ఏర్పాటు

తనకల్లు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీఓ పూల నరసింహులు ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పనులపై వచ్చేవారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నల్లమాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్ ప్రారంభించారు. వీఆర్ఓ వాసుదేవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అశ్వర్థనాయుడు పాల్గొన్నారు.

ఎండలు పెరిగేలోపు పనులు ముగించండి



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల



పెడపల్లి వద్ద సప్లై ఛానల్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

బత్తలపల్లి: వేసవిలో ఎండలు మండుతున్నాయని, ఎండలు పెరిగేలోపు పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీదేవి ఉపాధి కూలీలకు సూచించారు. పోట్లమర్రి గ్రామంలోని చెరువులో జరుగుతున్న 'అమృత్ సరోవర్ పనులను' మంగళవారం ఆమె ఏపీఓ కుందానం ఆదెప్పతో కలిసి పరిశీలించారు. వేతనాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ వేసవి నుంచి వేతనం రూ.272కు పెంచినట్లు తెలిపారు. ఉపాధి పనులను కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నల్లచెరువు: ఓరువాయి గ్రామం, కుమ్మరవాండ్లపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ శకుంతల మంగళవారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. కూలీలందరికీ పనులు కల్పిస్తామని చెప్పారు.

పుట్టపర్తి అర్బన్: పెడపల్లి, బత్తలపల్లి, దిగువచెర్లోపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపీడీ రఘునాథరెడ్డి, ఏపీఓ మధుసూధన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. వేసవిలో ఉదయాన్నే పనులకు వచ్చి ఎండలు పెరగకముందే ఇళ్లకు చేరుకోవాలని కూలీలకు సూచించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న, చందమూరి నారాయణరెడ్డి

ధర్మవరం: పట్టణంలోని 37వవార్డులోని మారుతీనగర్‌కు చెందిన బెస్త రాము ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పట్టణ సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి మంగళవారం రాము ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీపీకి గాయాలు

కొత్తచెరువు: కొత్తచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్డె నారాయణ భార్య, మాజీ ఎంపీపీ నాగమణికి రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ లింగన్న తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగమణి తన భర్తతో కలసి పుట్టపర్తి రహదారిలోని చికెన్ సెంటర్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా మలుపు వద్ద పుట్టపర్తి వైపు బైక్‌లో ప్రయాణిస్తున్న లోచర్ల గ్రామానికి చెందిన భైరవ అనే యువకుడు ఢీకొన్నాడు. నాగమణి తలకు తీవ్ర గాయాలు కావడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఉపాధ్యాయుడికి నోటీసు

ఓడీ చెరువు: జెరికుంటపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంపీడీఓ పోలప్ప, ఎంఈఓ ఖాదర్‌బాషా తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడంతో ఉపాధ్యాయుడు శంకర్‌రెడ్డికి నోటీసును జారీ చేసి సంజాయిషీ కోరారు.

చీరల వితరణ

గాండ్లపెంట: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని నాయి బ్రాహ్మణ కాలనీకి చెందిన మద్దిమడుగు ఓబన్న 50 మంది ముస్లిం మహిళలకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు.